# కాళరాత్రి

— ప్రభాకర్ జైని

గదిలోకి అడుగుపెడుతున్న అతణ్ణి చూడగానే నాకు చిరాకేసింది.

అతను భాస్కర్రావు. ఉబ్బసం రోగి. వ్యాధి ముదిరిపోయింది.

ఏ మందులకూ లొంగకుండా అతణ్ణి పట్టి పీడిస్తోంది.

తలుపు దగ్గర నుండి, నా ముందు వరకూ నడిచి వచ్చేసరికే అతను ఊపిరి అందక గిలగిలా కొట్టుకుంటున్నాడు. ముఖంలోని నరాలు ఉబ్బిపోయి, గాలి పీలుస్తుంటే గురు గురుమనే శబ్దం నాకూ్కడా వినిపిస్తోంది.

ఒక్క క్షణం "అయ్యో పాపం!" అని అనిపించినా నాకు అతని మీద విపరీతమైన కోపం ముంచుకొచ్చింది.

అయినా వృత్తి ధర్మాన్ని విడలేక 'ఎప్పటి నుండి?' అని ప్రశ్నించాను. అలా అడుగుతూనే యివ్వవలసిన మందును, ఇంజెక్షన్‌లోకి ఎక్కించే ప్రయత్నంలో పడ్డాను.

అతను దాన్ని చూస్తూ అది వద్దన్నట్టుగా తల అడ్డంగా వూపుతూ "మధ్యాహ్నమే డెరిఫిలిన్ తీసుకున్నాను. తగ్గలేదు. ఇంకేదైనా యివ్వండి" అన్నాడు. ఊపిరి అందకపోవడంతో అతని మాటలు బరువుగా వున్నాయి. ఎన్నాళ్ళ నుండో ఆ వ్యాధితో అవస్థపడుతున్నాడు కాబట్టి, వ్యాధి నివారణకు వాడాల్సిన మందులూ వాటి మోతాదులూ ఆహార నియమాలూ అన్నీ తెలుసు భాస్కర్రావుకు.

కానీ దుమ్మూ, ధూళీ, తాలింపు వంటి ఘాటైన వాసనలు అతనికి పడవు. కనీసం "తుమ్ములతో బాధ పడుతున్నారా? శీఘ్ర నివారిణైన మా బాస్‌నే వాడండి" అంటూ పత్రికల్లో పడే ప్రకటనతో పాటు, అమ్మాయో అబ్బాయో తుమ్ముతున్నట్టుగా యిచ్చే బొమ్మను చూసినా చాలు - అతనికి తుమ్ములూ, తుమ్ములతో పాటు ఆయాసం ముంచుకొచ్చి ఆస్మా ఎటాక్‌గా మారుతుంది. అందుకే సాధ్యమయినంత వరకు చాలా జాగ్రత్తగా వుంటాడు. కానీ ఏదో ఒక కారణంగా దాని కోరల్లో చిక్కుతూనే వుంటాడు. భాస్కర్రావు ఇంకేదైనా యివ్వమంటే దాని అర్థం నాకూ్కడా తెలుసు.

అది అడ్రినాలిన్. అది ఎక్కువ మోతాదులో యివ్వడం ప్రమాదం. కొంచెం అటూ యిటూ అయినా గుండె మీద ప్రభావం చూపుతుంది. ఆ విషయం నాకూ భాస్కర్రావు కూ్కడా తెలుసు. కానీ, ఆ సమయంలో అది యివ్వకపోయినా కూడా ప్రమాదమే. అందుకే ఆ యింజెక్షన్ చేశాను.

దాన్ని చూడగానే భాస్కర్రావు కళ్ళు మెరిశాయి.

భుజం దగ్గరికి సూది తెచ్చేసరికే, బాధ తగ్గి పోతున్నట్టుగా రిలీఫ్ ఫీలవుతున్నట్టుగా ముఖం పెట్టాడు.

నాగస్వరానికి మైమరిచిపోయి పాముల వాడి బుట్టలోకి నడిచే అమాయకపు నాగరాజులా, ఆ మందు రక్తనాళాల్లోకి పాకిందో లేదో, ఉబ్బసం నా చేతికి చిక్కిపోయింది.

పది నిముషాల తర్వాత మరో సూది యిచ్చాక, భాస్కర్రావు హుషారయిపోయాడు. అసలు అంతక్రితం వరకు ఉబ్బసంతో బాధపడ్డాడంటే, నేనే నమ్మలేకపోయాను. కిలకిలా నవ్వుతూ చతురోక్తులతో సెలవు తీసుకొని, బాలకుమారుడిలా గంతులేసుకుంటూ బయటకు నడిచాడు.

అందుకే నాకతన్ని చూస్తే చిరాకు.

తనకు ఇబ్బందయితే దాన్ని వదిలించుకోవడానికి, నా దగ్గరకు పరుగు పరుగున వస్తాడు. తను పడ్డ బాధ గురించి సవివరంగా చెప్పి, మందు తీసికొని, రోగం తాత్కాలికంగానైనా తగ్గించుకొని వెళ్ళిపోతాడు.

అప్పుడు మొదలవుతుంది నా అవస్థ.

ఎందుకంటే, భాస్కర్రావు కంటే ముదిరిపోయిన దశలో వుంది ఉబ్బసం వ్యాధి నాకు.

కనీసం అవో యివో మందులకు లొంగుతుంది భాస్కర్రావు రోగం. కానీ నాకయితే అదీ లేదు. గుండె వీక్‌గా వున్నందున ఎడ్రినాలిన్ తీసుకుంటే, అది ఆగిపోవడానికి ఐదు నిముషాల కన్నా ఎక్కువ పట్టదు నాకు. అందుకే అది లాభం లేదు. ఇన్‌హేలర్స్ అసలు పనిచేయవు. అందుకే తిరగబెట్టిందంటే కనీసం రెండు మూడు రోజులు నరకం చూపించి మరీ వదులుతుంది, మాయదారి ఉబ్బసం.

భాస్కర్రావుకు పుస్తకాల్లో ప్రకటనలు చూసినప్పుడు ఎటాక్ ప్రారంభమయితే, నా రోగుల్లో ఎవరైనా ఉబ్బసంతో బాధపడుతున్నామని ఆ లక్షణాలు చెప్తే చాలు, నాలో ఉబ్బసం వ్యాధి లక్షణాలు ప్రారంభమవుతాయి.

భాస్కర్రావు వంటి దీర్ఘరోగులు వస్తే యిక నా సంగతి చెప్పనవసరం లేదు.

అందుకే అతణ్ణి చూస్తే నాకు భయం, ఆందోళన, చిరాకు.

నలభై ఏళ్ళ నా అనుభవం, నాకు ఈ వ్యాధికి ఒక పరిష్కారం చూపలేదు.

పోనీ నా సంగతి వదిలేసినా, మా యింట్లోని వాళ్ళంతా డాక్టర్లే. మా ఆవిడా నేనూ ఒకే కాలేజీలో చదివి ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం. మా అబ్బాయి విదేశాల్లో వైద్య రంగంలో విశేష అనుభవం గడించి, ఈ మధ్యనే గర్భవతిగా వున్న కోడలుతో ఇండియా తిరిగొచ్చాడు. ఆ అమ్మాయి వాడి క్లాస్ మేటట. ఇండియన్ కానీ ఉత్తర భారతదేశానికి చెందింది. ప్రేమించి పెళ్ళి చేసుకున్నామంటే, ఆశీర్వదించాం మేం. మా అమ్మాయీ అల్లుడూ ఇఎన్‌టి స్పెషలిస్ట్స్. చిన్నమ్మాయి మైత్రి, మెడిసిన్ ఫైనలియర్లో వుంది. మా యింట్లోనే ఇంతమంది డాక్టర్లున్నా, స్వయంగా నేనే పేరు మోసిన వైద్యుణ్ణయినా నాకీ బాధ నుండి విముక్తి లభించడం లేదు.

గొప్ప వైద్యుణ్ణని పేరుగాంచిన నేనే రోగంతో తీసుకుంటున్నానని తెలిస్తే నా నైపుణ్యాన్ని శంకిస్తారని, నా పేరు ప్రతిష్ఠలకు కళంకమొస్తుందనే భయంతో, నా వ్యాధి గురించి చాలా జాగ్రత్తగా వుండేవాణ్ణి. గొప్ప గొప్ప డాక్టర్లతో పరిచయాలున్నా వాళ్ళతో నా రుగ్మత గురించి చర్చించే వాణ్ణి కాదు. ఇంతెందుకు, ఉబ్బసం గురించి తెలుసుకుంటే నా పేషెంట్లకైనా ఉపయోగపడుతుందనే వృత్తి ధర్మాన్ని కూడా మరిచి, అలా చేస్తే ఎక్కడ నాకీ రోగముందని వాళ్ళకు అనుమానమొస్తుందోనన్నట్లుగా ప్రవర్తించేవాణ్ణి. అందుకే ఇది మా కుటుంబ సభ్యుల్లోనే వుంచుకున్న ఈ రహస్యం ఒక్క మా నారాయణకు మాత్రం తెలుసు.

నారాయణ నా దగ్గర పనిచేసే కాంపౌండర్ అనే కన్నా నా చిరకాల మిత్రుడు అంటేనే సమంజసంగా వుంటుంది. భాస్కర్రావు లాంటి రోగులు వచ్చిన ప్రతిసారీ నాకు ఆయాసం రావడం గమనించి, వాళ్ళని నా దగ్గరకు ఓ మూనాన రానిచ్చేవాడు కాదు కొన్ని రోజుల క్రితం వరకూ. "ఉబ్బసం రోగులను చూడను" అని వాళ్ళకు గట్టిగా చెప్పమనేవాడు. అలా చెబితే నా రహస్యం బయటపడుతుందేమోనన్న శంక ఒక వంకా,



అదెంతవరకూ నా సమస్యకు పరిష్కారమవుతుందని ఒక వంకా అనిపించడంతో, అందుకు ఒప్పుకోలేదు.

ఇప్పుడు కూడా భాస్కరరావు బయటకు వెళ్ళాడో లేదో నారాయణ లోపలికొచ్చాడు.

అప్పటికే నా ముఖం మీద చెమటలు పడుతున్నాయి. కడుపు ఉబ్బిపోయి ఊపిరి భారమయింది.

తనను చూసి నవ్వలేక నవ్విన నన్ను కోపంగా చూశాడు నారాయణ. వెంటనే ఒక సూది గుచ్చాడు. వేడివేడిగా ఒక కాఫీ పోసి యిచ్చాడు. కిటికీలన్నీ మూసి, ఫ్యాన్ ఆపుచేసి బయటకెళ్ళాడు.

ఇద్దరు ముగ్గురు రోగులను చూసేసరికి బాగా అలసిపోయాను. ఇక నా వల్లకాదనిపించింది. నారాయణను పిలిచాను. నీటి నుండి బయటపడి ప్రాణ వాయువు కోసం గిలగిలా కొట్టుకునే చేపపిల్లలా తయారయింది నా పరిస్థితి. ఊపిరితిత్తులను సిమెంట్‌తో కాంక్రీట్ చేసినట్టుగా, బిగుసుకుపోయి గాలి అందించే ప్రక్రియను మానేశాయి.

ఇంధనం సరఫరా కాకపోవడంతో పనిచేయనని మొరాయించే యంత్రంలా తయారయింది నా పరిస్థితి ఒళ్ళంతా చెమటలు పట్టాయి.

నారాయణ మరో ఇంజెక్షన్ యిచ్చాడు. వెంటనే నన్ను కారులో కూర్చోబెట్టి, క్లినిక్‌కు తాళాలు వేసి వచ్చి కూర్చున్నాక, ఇంటికి బయల్దేరాం.

నేను ఒకచోట స్థిమితంగా కూర్చుండలేక ముందు సీటు మీద తలవాల్చి కూర్చుందామని ప్రయత్నించాను. గురక యింకా ఎక్కువయ్యేసరికి వెనక సీటులో పడుకుందామని ఒరిగాను. ఒక్క నిముషం ఆ భంగిమలో వున్నానో లేదో ఆయాసం మరింత ఎక్కువయినట్టు ఊపిరితిత్తులు నీటిలో తడిసిన దూది సంచుల్లా బరువయినట్టుగా తోచడంతో లేచి కూర్చున్నాను.

"భగవాన్! ఏమిటిది? ఇంతమందికి సంపూర్ణారోగ్యాలు పంచియిచ్చే మంచి మనిషికి ఈ అవస్థ ఎందుకు?" అంటున్న నారాయణను కోపంగా చూశాను.

"నోర్మూసుకో" అందామనుకున్నా నోట్లో నుంచి మాట పెగలడం లేదు.

నారాయణ ఇచ్చిన ఇంజెక్షన్లు నా బాధను తగ్గించలేకపోయినా, నా శరీరాన్ని మాత్రం వణికించసాగాయి. శరీరం బరువునంతా రెండు చేతుల మీద ఆనించి కూర్చున్నాను నేను. దాంతో చేతులు వణకడం మొదలయింది. నడుము దగ్గర నొప్పి, నా బరువును మోయలేనట్లుగా నడుముల్లో తీపులు మొదలయ్యాయి. కిటికీకి దగ్గరగా జరిగి, ఒరిగి కూర్చున్నాను.

బ్రతికుండే యింటికి చేరగలనా అని అన్పించింది నాకు.

నారాయణను చేతితో తట్టి తొందరగా పోనీయమన్నట్టుగా సైగ చేశాను.

'అలాగే అలాగే' అని నారాయణ డ్రైవర్‌కు చెప్పాడు.

ఆస్మా ఎటాక్ వచ్చినప్పుడు నా ప్రవర్తన వింతగా మారుతుంది. నా జబ్బు మీద, దాన్ని క్యూర్ చేసుకోలేని నా అసమర్థత మీద నాకే అసహ్యం పెరిగి అది ఎవరు కనబడితే వాళ్ళ మీదల్లా చిరాకు పడటం ద్వారా బహిర్గతమవుతుంది. ఆ సమయంలో నేను తిట్టడం, చిరాకుపడటం, అరవడం మా యింట్లో వాళ్ళందరికీ తెలిసిన విషయమే. వాళ్ళు దానికి అలవాటు పడిపోయారు కూడా. నేను చిరాకు పడితే వాళ్ళు బాధ పడకుండా, నిర్లిప్తంగా భరించడం కూడా ఒక్కోసారి నాకు నచ్చేది కాదు. అంటే నేనో ఫూల్‌లా ప్రవర్తిస్తున్నాను కాబట్టి ఆ విషయం గురించి పట్టించుకునే అవసరం లేదన్నట్లుగా, నిర్లక్ష్యంగా, ఉదాసీనంగా నా తిట్లకు ఏమాత్రం స్పందించకుండా వుండే వాళ్ళంటే నాకు ఒళ్ళు మండిపోయేది.

ఇల్లు చేరుకునేసరికి నాలో కొన ప్రాణం మాత్రం మిగిలి వున్నట్టనిపించింది.

చెరో ప్రక్క పట్టుకుని ఇంట్లోకి నడిపించారు.

ఆ పరిస్థితుల్లోనూ, ముందు గదిలో కొట్టొచ్చినట్టుగా కన్పించే "వైద్యో నారాయణో హరిః" అక్షరాలు చూసి నవ్వొచ్చింది నాకు.

ఒంటిమీద బట్టలు కూడా బరువయినట్టు, నడుముకున్న బెల్టు కొండ చిలువలా నన్ను చుట్టుకొని నా జీవసారాన్ని హరించి వేస్తున్నట్లుగా తోచడంతో బట్టలు విప్పి పారేశాను, ఇంట్లోకి అడుగు పెట్టగానే.

నన్ను నా గదిలో పడుకోబెట్టి, మౌనంగా నా వంకే చూస్తున్న అమ్మాయితో "అమ్మగారు...?" అంటూ ఆగిపోయాడు నారాయణ.

"నైట్ డ్యూటీ"

## ......ఏది

బతకగలనన్న భరోసా ఏది...?
ఈ బతుక్కి కన్నీటి పాట తప్ప చిర్నవ్వు మాట ఏది...?
ఈ జీవితానికి క్షేమదాయకమైన ఆరోగ్యం ఏది?...
సహజత్వాన్ని కోల్పోతూ నిస్తేజంగా పడుండడమే గాని
కళ్ళారా సంతోషాన్ని ఒలికిన క్షణాలేవి
రోజులు నెలలుగా నెలలు సంవత్సరాలుగా
ఇలా పలు సమస్యల రోడ్డుమీద
బతుకు బండరాయిని దొర్లించుకు పోవడమే గాని
కళ్ళ కొలుకుల్లో ఆనందాశ్రువులు తొణికిన జాడలేవి...?
బొట్లుబొట్లుగా రాలి చిట్లిపోతూ ఆశాబిందువులై
అడుగు నుంచి అడుగు వేసుకొంటూ నడుస్తూన్న నీడలా...
కలల మొలిపించుకొంటూ జీవన ఫలాన్ని అందుకోవాలన్న కాంక్షలా...
ఇక్కడ ప్రతి నిమిషం బతుకు అంతర్యుద్ధంలోంచి నిష్క్రమించాలని
వ్యధితులై విహ్వలులై ఆవేదనతో అలసటతో
తను నుంచి తాను దూరమవుతూ కునుకుపాటు తీరాన్ని ఆశ్రయిస్తూ...
ఒంటినిండా పేడ ముద్దల్ని పులుముకొన్న అసభ్య సినీవాల్ పోస్టర్‌లా
బతుకు బహిర్ముఖం సల్పుతున్న అశాంతి గాయాలతో ఒక వికృత దృశ్యమవుతుంది...,
'నిన్నటి' స్వప్నం పగిలిన క్షణంలోంచి మరో 'నేడు' ప్రాణస్పందన పోసుకొన్నట్లు,
ప్రిదిలిన ఈ అగమ్య బతుకునుంచి ఓ కొత్త బతుక్కి ఆలోచనను విత్తుకొంటూ ..

—అవనిగడ్డ సూర్యప్రకాష్

నాకు అటాక్ వచ్చినపుడు ఎవరైనా సానుభూతి చూపించినా ఆదుర్దా కనబరిచినా నాకు చికాకు. అందుకే ఊపిరి అందక ఉంగలు చుట్టుకుపోతున్న నన్ను చూసి కూడా మా అమ్మాయి దుఃఖాన్ని బిగపట్టుకుని చూస్తూ నిలబడిపోయింది. ఆ విషయం నాకు అర్థమవుతూనే వుంది. అయినా సరే ఆ బాధను ఏ మాత్రం బయటకు ప్రదర్శించినా నాకు వెర్రెత్తుకు రావడం ఖాయం.

మా ఆవిడకు తప్ప ఆ సమయంలో నన్ను పలకరించే ధైర్యం ఎవరికీ ఎందుకుండదో నాకు ఇప్పటికీ అర్థంకాని విషయమే. అందుకే, సానుభూతి చూపించ నవసరం లేకున్నా కనీసం వేరే ఏదైనా మాట్లాడవచ్చును కదా అని ఆ క్షణంలో నాకు అనిపించింది.

నారాయణ మా ఆవిడను ఇంటికి పిలిపించే ప్రయత్నంలోపడ్డాడు. కోడలికి నిండు నెలలు. అంతేకాకుండా అబ్బాయి కూడా ఏదో కాన్ఫరెన్స్ వుందని బెంగుళూరు వెళ్ళాడు. కాబట్టి తన గదిలోనే విశ్రాంతి తీసుకుంటున్నట్టుంది. అయితే నాకు ఈ జబ్బున్నట్టు అదీ ఇంత తీవ్రంగా వున్నట్టు ఆమెకు తెలుసో లేదో నాకు తెలీదు.

మానసికంగా ఉత్సాహం కలిగితే, నేను కొంత తేరుకుంటానని నా గదిలోని టి.వి.ని ఆన్ చేసింది అమ్మాయి నా వైపు బెరుకుగా చూస్తూ.

"అదే నాకు నచ్చదు. నాకు మాత్రం తెలియదూ ప్రతి చిన్నదానికి చిరాకు పడొద్దని. అయినా వీళ్ళంతా నన్నేదో భూతంలా చూస్తూ దూరదూరంగా వుంటూ భయం భయంగా ప్రవర్తించడంతోనే నాకు చిరాకు పెరుగుతుంది" అని అనుకున్నాను మనసులో. ఆయాసం మూలంగా చెమటలు కారిపోతున్నా, ఫ్యాన్ గాలి నాకు పడదు కాబట్టి ఆ ప్రయత్నం చేయకుండా శుభ్రమైన మెత్తటి తువ్వాలుతో సున్నితంగా నా శరీరాన్ని అద్దసాగింది అమ్మాయి. బిక్కుబిక్కుమంటూ నాకు సేవలు చేయడానికి కూడా బెదిరిపోతున్న అమ్మాయిని చూస్తే జాలి వేసింది.

అతి కష్టంగా చేయి లేపి అమ్మాయి భుజం మీద వేశాను. అదిరి పడ్డట్టుగా నా ముఖంలోకి చూసి, నా ముఖంలో చిరాకు, కోపచ్ఛాయలకు బదులుగా తనకేం కనిపించిందో కానీ చిరుగాలి స్పర్శకు పులకరించిన మేఘబాలలా భోరుమంది.

"నాన్నా! నాన్నా!" అంటూ నన్ను కావలించుకొని ఏడ్చింది. ఆ కుదుపులను భరించాను. ఇంతలోనే తన తప్పు తెలుసుకున్న దానిలా దూరంగా జరిగి కళ్ళు తుడుచుకుంటూ —

"బాగా ఎక్కువగా వుందా నాన్నా?" అని అడిగింది.

"అవును తల్లీ" అన్నట్టుగా తల వూపాను.

వెల్లకిలా పడుకుంటే ఇబ్బందిగా వుందని, రెండు మూడు దిళ్ళు పేర్చి బోర్లా పడుకున్నాను. పూర్ణ గర్భిణీ స్త్రీలకు మాదిరిగా నా ఉదరం ఉబ్బిపోయి చిన్న బరువును కూడా మోయలేదు. ఊపిరి సలపనట్టు అనిపించడంతో "అమ్మో!" అని బాధగా మూలిగి ఆ భంగిమను మార్చాను. మోకాళ్ళు ముడిచి, తల్లి ఒడిలో ఆదమరిచి నిద్రించే పసిపాపలా దిళ్ళ మీద తల ఆనించి బోర్లా పడుకున్నాను.

"ఆ ఇట్లా బాగుంది" అని అనుకున్నాను.

ఇంతలో మా ఆవిడ రానే వచ్చింది.

తన చేతి స్పర్శ కోసం, ఆ స్పర్శ ప్రసాదించే అనంతమైన శక్తి కోసం ప్రాణవాయువు కోసం అలమటించే, బుట్టలోని చేపలా ఆరాటంగా ఎదురుచూస్తున్న నా నిరీక్షణ ఫలించి, ఆవిడ రానే వచ్చింది.

నగ్నంగా వున్న నా చేతిని ఆమె మృదువుగా రాస్తుంటే, అది అమృతస్పర్శలా తోచింది. తను తాకిన నా శరీర భాగమంతా చైతన్యవంతమైనట్టు, గాంధారి దుర్యోధనుడి శరీరాన్ని తాకి వజ్ర సమానం చేసినట్టుగా అనిపించింది. ఆ స్పర్శ తాలూకు అమరత్వాన్ని ఆస్వాదిస్తూ కళ్ళు తెరిచిన నాకు బలవంతంగా దుఃఖాన్ని అనుకొని, దైన్యమూర్తిలా గోచరించిందామె. ఆమె కళ్ళు — జీవ చైతన్యం కోల్పోయి నిర్లిప్తంగా విషాద సరస్సులో, చెలికాడి వియోగంతో తిరుగాడుతున్న రాజహంసల్లా అనిపించాయి నాకు.

"ఎందుకు అలా కుళ్ళి కుళ్ళి చింతించడం. నాకేమైంది. ఇదేమైనా కొత్త రోగమా? ఇరవై ఏళ్ళుగా వున్నదే కదా" ఈ ఆలోచన రాగానే నాకు ఆవిడ వచ్చిందన్న సంతోషం పోయి చిరాకు మొదలైంది. తన చేయి విసురుగా తోసేశాను.

నోట్లో కొంగు కుక్కుకొని బయటకు పరుగెత్తిందామె. నా గది అవతల తల్లీకూతుళ్ళు కలిసి ఏడుస్తున్నారని ఊహించాను. ఇంతలోనే నా తప్పు గ్రహించాను.

"అరే నాకేమయిపోతుంది? నాకు ఆరోగ్యం బాగో లేకపోతే వాళ్ళు నవ్వుతూ తుళ్ళుతూ ఎలా తిరగ్గలరు? వాళ్ళు బాధ పడడంలో తప్పు లేదు. కానీ వాళ్ళు బాధ పడుతుంటే చూసి నేను చిరాకుపడడమే నిజంగా తప్పు" అని అనిపించింది.

వాళ్ళను లోపలికి పిలవమని నారాయణకు సైగ చేశాను.

"తప్పయింది" అన్నట్టుగా సైగ చేస్తున్న నన్ను చూసి "అలా అనొద్దండీ, మీ బాధ మాకు తెలియదా?" అని మళ్ళీ కన్నీళ్ళు పెట్టుకుంది.

"సారీ! ఈ బాధ భరించలేకున్నాను. ఐ వాంట్ కిల్ మైసెల్ఫ్" అన్నాను. అలా అనొద్దన్నట్టుగా కన్నీళ్ళ తోనే సైగ చేసింది.

"పోనీ, ఇంత అవస్థగా వుంది కదా, మూర్తిగారిని పిలుద్దామా?" అని అడిగింది. మూర్తి నా శిష్యుడే. చెస్ట్ స్పెషలిస్ట్‌గా చాలా పేరు ప్రఖ్యాతులు గాంచాడు. ఆస్త్మాకు చాలా రకాల చిట్కాలతో, మందులతో

నివారణోపాయాలు కనిపెట్టాడని అందరూ అంటుంటారు. కానీ నాలాంటి ముదిరిపోయిన వ్యాధికి అతను మాత్రం ఏం చేయలేడనే నాకో నమ్మకం. నాకు అటాక్ వచ్చినప్పుడల్లా అతణ్ణే పిలుద్దామని అందరూ అనడం — నా విషయం బయటపడుతుందనే బెరుకో, లేక నా రోగానికి మందు లేదనే ఆధారం లేని భయమో చెప్పలేను కానీ — నేను కొట్టివేయడం అలవాటయిపోయింది మా ఇంట్లో.

ఏదో ఘాటైన పెయిన్‌బాం ఛాతీకి, వీపుకు రాస్తుంటే హాయిగా అనిపించింది. ఆయాసం కూడా కొంచెం తగ్గుముఖం పడుతున్నట్టుగా తోచింది. రెండు, మూడు గంటల పాటు ఉక్కిరి బిక్కిరి చేసిన తర్వాత, నన్ను క్షమించినట్టుగా ఊపిరితిత్తులు కొంచెం తేలికయ్యాయి. గాలి పీలుస్తుంటే పిల్లి కూతల ఉధృతం తగ్గింది. కళ్ళు మూతలు పడడం మొదలయింది నాకు.




అలా ఎంతసేపు పడుకున్నానో గానీ — ఊపిరందక ప్రాణాలు పోతాయేమోనన్నంతగా ఛాతీలో నెప్పి మొదలుకావడంతో ఒక్క ఉదుటున లేచాను. ఒళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి. గదంతా చీకటిగా వుంది. మా ఆవిడా అమ్మాయీ నా నిద్రకు అంతరాయం కలగకుండా వుండాలని బయటకు వెళ్ళినట్టుంది. టైమెంతయిందో కూడా తెలియడం లేదు. ప్రక్కనే వున్న అద్దాలను వెతికి కళ్ళకు తగిలించుకున్నాను. ఆ చిన్న కదలికకే ఉధృతంగా దగ్గు వచ్చింది. గొంతుకు అడ్డం పడిన కళ్ళెను దగ్గి దగ్గి బయటకు ఊసిన తర్వాతగానీ గాలి పీల్చలేకపోయాను. విపరీతంగా దగ్గడం మూలంగా తల పగిలిపోతున్నట్టూ, కళ్ళు పేలిపోతాయేమోనన్నట్టుగా ముఖంలోని కండరాలన్నీ ఉబ్బాయి. రెండు గంటల విశ్రాంతి తీసుకున్నందుకు నష్ట పరిహారమన్నట్టుగా మళ్ళీ పెద్ద ఎత్తున అటాక్ వచ్చింది. గాలి అందక విలవిల లాడిపోతూ బాగా మూలిగాను. ఆ అలికిడికి అందరూ నా గదిలోకి వచ్చారు.

మంచంలో గిలగిల కొట్టుకుంటున్న నన్ను చూసి మా ఆవిడ ఇక నా అపోహలనూ అభ్యంతరాలనూ లెక్కచేయక డాక్టర్ మూర్తికి ఫోన్ చేసేందుకు కాబోలు బయటకు నడిచింది.

మా ఆవిడ, అమ్మాయిలతోపాటు ఈసారి కోడలు కూడా నా గదిలోకి వచ్చింది.

నా పరిస్థితి చూసి ఒక్క అంగలో మంచం దగ్గర కొచ్చి "డాడీ వాటీజ్ దిస్" అని అడిగింది. ఆమెకు తెలుగు రాదు. నేను మౌనం వహించాను. కన్నీళ్ళు రాలుతుండగా నా నెన్నుపాము మీద తన చేతితో ఆప్యాయంగా నిమిరింది. ఆ స్పర్శ అచ్చం మా అమ్మ స్మర్శలా అనిపించింది. కొంచెం వెచ్చగా, మృదువుగా వున్న ఆ స్పర్శ మా ఆవిడ-స్మర్శకన్నా భిన్నంగా వుంది.

కానీ మహమ్మారి లాంటి ఈ వ్యాధికి ఆప్యాయాను రాగాలేం తెలుస్తాయి?

అమాయకంగా దైవ ప్రతి రూపాల్లా వుండే కుందేలు పిల్లలను వేటాడే వాడికి వాటిని చూస్తే స్పందన లెలా కలుగుతాయి? నేను బాధలో ఆ అమ్మాయి చేయి తీసేసి మరో ప్రక్కకు తిరిగాను.

"ఏ చేద్దాం మాజీ" అంటూ ఆదుర్దాగా అడిగింది మా ఆవిడను. ఆవిడ మాట్లాడ వద్దన్నట్టుగా సైగ చేసింది.

ఇక నా వల్ల కాలేదు. సభ్యతా పరిధులకు లోబడి నేను నా బాధను ఓర్చుకోలేక పోయాను.

"అమ్మా అబ్బా" అంటూ అరవసాగాను.

తలుపు తెరుచుకున్నట్టుగా చప్పుడు లీలగా వినిపించింది.

ఆ తర్వాత నా కేమయిందో తెలియదు. బహుశా నిద్రాదేవత తన అపూర్వ శక్తితో నన్ను తన ఒడిలో నిద్రపుచ్చిందేమో.

మళ్ళీ మెలుకువ వచ్చేసరికి నాకు ఆయాసం లేదు గానీ ఏదో ఇబ్బందిగా వుంది.

కళ్ళు మూసుకునే వున్న నాకు ప్రపంచమంతా ప్రశాంతంగా వున్నట్టనిపించింది. దూరంగా వెంకటేశ్వర సుప్రభాతం లీలగా వినిపిస్తూంది. ఆ మాధుర్యానికి పరవశించినట్టుగా, మా చెట్టు మీది కోకిల తన గళం కూడా కలిపింది.

ఆ క్షణంలో, పూచిక పుల్లలా, చిరుగాలికే నయ్యారాలుపోతూ, ఆకాశంలో ఎగిరే పక్షి ఈకలా, ఆక్రో



బాటిక్స్ ఆటగాడి శరీరంలా తోచింది నా శరీరం.

ఇంత తేలికగా, హాయిగా ఉందేమిటబ్బా? పునర్జన్మ ఎత్తానా లేక కలగంటున్నానా? అనే అనుమానం కలిగింది. కళ్ళు తెరిస్తే కల చెదిరి, స్వప్న సౌధం కూలి అస్త్మా రాక్షసి ఒళ్ళో ముక్కుతూ మూలుగుతూ, గిలగిలా కొట్టుకుంటూ ప్రత్యక్ష నరకం అనుభవిస్తానేమోనని భయపడుతూనే కళ్ళు తెరిచిన నాకు నా ముఖానికి తగిలించిన ట్యూబులు కనిపించాయి. నా వంకే ఆందోళనగా చూస్తున్న మా ఆవిడా అమ్మాయీ కోడలూ, నారాయణా కనిపించారు.

డాక్టర్ మూర్తి ప్రక్కనే సోఫాలో ఒళ్ళు తెలియకుండా పడుకుని వున్నాడు. అప్పటి దాకా నాకు తెలియలేదుగానీ — నా ప్రమేయం లేకుండానే నా ఊపిరితిత్తుల్లోకి జీవశక్తినీ, జీవన ఇంధనాన్నీ పంప్ చేస్తోంది ప్రక్కనే వున్న ఆక్సిజన్ యంత్రం.

అందరి ముఖాల్లోకీ పరిశీలనగా చూశాను నేను.

"ఇది ఎప్పుడూ వుండే భాగోతమే. కాకపోతే ఈసారి ఇంకొంచెం ఇబ్బంది పెట్టింది అంతే" అని అనుకుంటున్నాడు కాబోలు నారాయణ. అందుకే ఏ భావం కనిపించడం లేదు అతని ముఖంలో.

మా అమ్మాయి సంతోషంతో "కాఫీ తెస్తా" నంటూ లోపలికి పరిగెత్తింది. మాతృదేవతకు ప్రతి రూపంలా వున్న నా కోడలు - భారంగా - అడుగు ముందుకేసి నా చేయి పట్టుకుంది.

మా ఆవిడ కళ్ళల్లో - సంతోషానికో, సమసిపోయిన దుఃఖానికో - నీరు చిప్పిల్లింది.

మృత్యుముఖంలోకి తీసుకెళ్ళిన కాళరాత్రి గడిచిపోయిందన్న సంతోషానికి చిహ్నంగా కాబోలు నా పెదాలపై చిరునవ్వు మొలకెత్తబోతోంది.

మా అందరి ఆందోళననూ దూరం చేసిన ఆక్సిజన్ యంత్రం నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుపోతోంది. దానికి యజమానీ, నా శిష్యుడూ అయిన డాక్టర్ మూర్తి మాత్రం హాయిగా నిద్రపోతున్నాడు.